**కె.బాలగోపాల్**

అందరమూ మన కారణంగానో మనవారి కారణంగానో ప్రైవేట్ ఆస్పత్రుల బాధితులమే కాబట్టి రోగుల పట్ల ప్రైవేట్ ఆస్పత్రులకు ఉండే బాధ్యత గురించి సుప్రీంకోర్టు ఈ మధ్యనే ఇచ్చిన తీర్పు సారాంశాన్ని తెలుసుకోవడం ఉచితంగా ఉంటుంది. సమీరా కోహ్లీ అనే స్త్రీ రుతుక్రమం సవ్యంగా లేదనీ రక్తస్రావం అధికంగా అవుతున్నదనీ డాక్టర్ దగ్గరకు వెళ్లింది. ఆమెకప్పటికి 44 సంవత్సరాల వయస్సు. అప్పటివరకు అవివాహితగా ఉన్న అమెకు అప్పుడే పెళ్లి నిశ్చయమయింది. మరికొన్ని రోజులలో పెళ్లి కావలసి ఉంది. రోగనిర్ధారణ కోసం ఆపరేషన్ చేయవలసి ఉంటుందని చెప్పి 'లాపరోస్కోపీ, అవసరమైతే లాపరోటమీ' చేయడానికని ఆమె సమ్మతిని కాగితం మీద తీసుకొని ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. (నిజానికి తన సంతకం ఖాళీ ఫారం మీద తీసుకొని ఆ తరువాత పై నాలుగు ముక్కలు రాశారని ఆమె అంటుంది). ఆమెకు మత్తుమందు ఇచ్చి (జనరల్ అనస్తీషియా) ఆపరేషన్ చేయసాగారు. 80 సంవత్సరాల వయసున్న సమీరా తల్లి బయట కూర్చొని ఉంది. అంతలో ఆపరేషన్ చేస్తున్న డాక్టర్‌గారి అసిస్టెంట్ వడివడిగా బయటికొచ్చి రక్తస్రావం ఎక్కువయిందనీ, గర్భసంచినీ ఇతర జననాంగాలను (ఓవరీస్, ఫాలోపియన్ ట్యూబ్స్)కూడా తొలగించాలనీ దానికి సమ్మతి కావాలనీ తల్లి చేత సమ్మతి కాగితంపైన సంతకం తీసుకొనింది. ఆపరేషన్ పూర్తయి సమీరాకు తెలివి వచ్చిన తరువాత కూడ ఏం జరిగిందీ డాక్టర్ ఆమెకు చెప్పలేదు. మూడు రోజుల తరువాత డాక్టర్‌గారి కుమారుడు మాటల సందర్భంగా ఆమె గర్భసంచి తీసేసిన విషయం ఆమెకు చెప్పాడు. నాకు చెప్పకుండా ఆ పని ఎందుకు చేశారని ఆమె ప్రశ్నించగా, 'ఇంత వయసొచ్చింది ఇంకా పిల్లల్ని ఏం కంటావు? నీకొచ్చిన నష్టమేమీ లేదు' అని అతను దురుసుగా సమాధానం చెప్పాడు. ఆమెకు కాబోయే భర్త మరుసటి రోజు ఆస్పత్రికి వచ్చి గొడవ పెట్టుకొని ఫీజు చెల్లించకుండా ఆమెను తీసుకువెళ్లిపోయాడు. ఆ తరువాత ఇరుపక్షాలూ ఒకరి మీద ఒకరు కేసులు వేసుకున్నారు. 39,325 రూపాయల ఫీజు చెల్లించాల్సి ఉందని (ఇది 1995లో జరిగిన కథ) డాక్టరు రోగి మీద సివిల్ కోర్టులో దావావేయగా, చెప్పకుండా జననాంగాలను తొలగించినందుకు, ఆ తరువాత అనారోగ్యం వల్ల అయిన ఖర్చు కు నష్టపరిహారం చెల్లించాలని రోగి వినియోగదారుల ఫోరంలో డాక్టర్ మీద కేసు వేసింది. డాక్టర్ తాను వేసిన దావాలో నెగ్గింది. సమీరా మాత్రం జిల్లా ఫోరం నుంచి జాతీయ ఫోరం దాకా ఓడిపోయి చివరికి సుప్రీంకోర్టులో అప్పీల్ వేసింది. సుప్రీం కోర్టు ఆమెకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. డాక్టర్ ఫీజును రద్దు చేసి, రోగి ఖర్చులు 25,000 రూపాయలు కూడ డాక్టరే చెల్లించాలని ఆదేశించింది. ఈ తీర్పు ఇచ్చిన క్రమంలో జస్టిస్ ఆర్.వి. రవీంద్రన్ ప్రైవేట్ ఆస్పత్రుల రోగుల సమాచార హక్కుకు సంబంధించి కొన్ని ఉపయోగకరమైన సూత్రీకరణలు చేశారు.

ప్రైవేట్ ఆస్పత్రులు అందిస్తున్నది నైపుణ్యంతో కూడిన సేవే అయినప్పటికీ, ఆ రంగంలోనూ నిజాయితీగా వృత్తి నిర్వహించే వైద్యులు చాలా మంది ఉన్నప్పటికీ, ఆ సంస్థలు ప్రధానంగా చేస్తున్నది వ్యాపారం అని జస్టిస్ రవీంద్రన్ గుర్తించారు. విద్యావ్యాపారాన్ని గురించి ఆ మాట అనడానికి సుప్రీంకోర్టు ఇప్పటికీ తటపాయిస్తున్నందున ఇదొక ముందడుగేనని భావించాలి. ఈ ఆస్పత్రులు ఖరీదయిన రోగనిర్ధారణ ప్రక్రియలనూ, రోగాన్ని నయంచేసే ప్రక్రియలనూ అనవసరంగా రోగుల మీద రుద్దుతాయనీ, అనవసరమైన ఆపరేషన్లు పురమాయిస్తాయనీ ప్రజలలో ఉన్న అభిప్రాయాన్ని ఆయన ప్రస్తావిస్తూ, ఇదంతా లాభార్జన కోసమేనన్న అనుమానంతో ఏకీభావాన్ని వ్యక్తం చేశారు. 'అమాయకత్వం అంటారేమోగానీ' దీనికి పరిష్కారం 'ప్రభుత్వమూ, ధర్మ (ఛారిటబుల్) సంస్థలూ వైద్యరంగంలో ఇతోధికమైన పాత్ర నిర్వహించడమే కాగలదు' అన్న అభిప్రాయం కూడ పనిలో పనిగా వ్యక్తం చేశారు. కాగా, ఈ నేపథ్యంలో ఈ వైద్య ప్రక్రియలకు లోనయ్యే రోగుల సమాచార




# రోగులకు సమాచార హక్కు

హక్కు ఏమిటి అన్న ప్రశ్నను ఆయన అమెరికా, ఇంగ్లాండ్, కెనడా దేశాల న్యాయవ్యవస్థల తీర్పులను ఉటంకిస్తూ వివరంగా చర్చించారు. వైద్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించినంత కాలం, రోగనిర్ధారణలోనూ రోగాన్ని నయం చేయగల ప్రక్రియల ఎంపికలోనూ తగు విజ్ఞతతో వ్యవహరించినంతకాలం, రోగులకు సమాచారం ఉందా లేదా, వారు సమాచారయుతమైన సమ్మతి ఇచ్చారా లేదా అన్న ప్రశ్న ఉత్పన్నం కాదన్న వాదనను ఆయన తిరస్కరించారు. మరింత నిర్దిష్టంగా- రోగనిర్ధారణకు అవసరమైన పరీక్షలకు రోగి సమ్మతి ఇచ్చినట్టయితే ఆ నిర్ధారణ ఆధారంగా వైద్యులు బాధ్యతాయుతంగా ఎంపికచేసే ట్రీట్‌మెంట్‌కీ ఇచ్చినట్టేనని, రోగాన్ని నయం చేయగల ఒక ప్రక్రియకు సమ్మతి ఇచ్చినట్టయితే దానికి అదనంగా లేక అనుబంధంగా వైద్యులు చేపట్టే వేరొక ప్రక్రియకూ ఇచ్చినట్టేననీ (కాబట్టి సమీరా కోహ్లీ లాపరోస్కోపీకీ, లాపరోటమీకీ సమ్మతి ఇచ్చింది కాబట్టి హిస్టరక్టమీకి కూడ ఇచ్చినట్టేననీ) ప్రతివాది చేసిన వాదనను జస్టిస్ రవీంద్రన్ తిరస్కరించారు.

'మనిషికి తన శరీరం మీద అనుల్లంఘనీయమైన హక్కు ఉంది' అన్న సూత్రాన్ని దృష్టిలో పెట్టుకున్నప్పుడు డాక్టరు విజ్ఞతతోనూ బాధ్యతాయుతంగానూ వ్యవహరించారా లేదా అన్నదొక్కటే కాదు, రోగి సమ్మతి ఉందా లేదా అన్నది కూడ ముఖ్యమైన విషయమేనన్నారు. అమెరికాలో న్యాయస్థానాలు ఈ సమ్మతి 'సమాచారయుతమైనది'గా ఉండాలంటాయి. (ఇన్‌ఫార్మ్డ్ కన్సెంట్) ఇంగ్లండ్‌లో న్యాయస్థానాలు అది 'నిజమైన సమ్మతి' (రియల్ కన్సెంట్) అయి ఉండాలంటాయి. 'సమాచారయుతమైన' సమ్మతి అన్నప్పుడు రోగికి అమలు చేయబోతున్న వైద్య ప్రక్రియలోని ప్రయోజనాలు, సమస్యల గురించి తెలియజేయాలి; అంతేకాక ప్రత్యామ్నాయ వైద్య ప్రక్రియలలోని ప్రయోజనాలు, సమస్యల గురించి కూడా వివరించాలి; అసలు ఏ వైద్యమూ చేయించుకోని పక్షంలో పర్యవసానాల గురించి సైతం రోగులకు వైద్యులు సమగ్ర సమాచారం ఇవ్వాలి. 'నిజమైన సమ్మతి' ఇంతదూరం పోదు. రోగి అర్థవంతంగా సమ్మతి ఇవ్వడానికి కావలసిన సమాచారమంతా రోగికి ఇవ్వాలంటుంది. ఇందులో మొదటిది( అంటే అమెరికా న్యాయస్థానాలు అనుసరించే ప్రమాణం) భారత్‌కు పనికి రాదనీ, దానిని అనుసరించినట్టయితే ఆ పేరు మీద వైద్యులు మరిన్ని పరీక్షలు వగైరా చేపట్టి మరింత ఫీజు వసూలు చేసే ప్రమాదం ఉందనీ జస్టిస్ రవీంద్రన్ అన్నారు. రెండవది (అంటే ఇంగ్లండ్‌లోని న్యాయవ్యవస్థ అనుసరించే ప్రమాణం) ఇండియాకు తగినదన్నారు. కానీ నిజానికి ఆయన సూచించిన ప్రమాణం రెండింటికీ మధ్యస్తంగా ఉంది. అదేమిటంటే: (అ) వైద్యప్రక్రియ (ట్రీట్‌మెంట్) మొదలుపెట్టే ముందు వైద్యులు రోగి సమ్మతి పొందాలి. అది స్వచ్ఛందమైన సమ్మతి అయి ఉండాలి. అంటే సమ్మతి ఇచ్చే సామర్థ్యం రోగికి ఉండాలి, అందుకు తగిన సమాచారం (వైద్యప్రక్రియ స్వరూప స్వభావాల గురించి) రోగికి అందజెయ్యాలి. (ఆ) తగిన సమాచారం అంటే ఆ ప్రక్రియకు ఆమోదం తెలుపాలా లేదా అన్న నిర్ణయం తీసుకోవడానికి సరిపోయే సమాచారం. అంటే ఆ ప్రక్రియలక్ష్యం, స్వభావం, ఫలితాలు, ప్రభావాల గురించి చెప్పాలి. ప్రత్యామ్నాయాలేవైనా ఉంటే వాటి గురించి చెప్పాలి. ఉండగల రిస్క్ గురించి చెప్పాలి. నిరాకరిస్తే ఉండగల పర్యవసానాల గురించి చెప్పాలి. అయితే ఎప్పుడో చాలా అరుదుగా మాత్రమే సంభవించగల హాని గురించి చెప్పి రోగిని బెదరగొట్టనవసరం లేదు. ( ఇ) రోగనిర్ధారణకు ఇచ్చే సమ్మతిని ట్రీట్‌మెంట్ ప్రక్రియకు ఇచ్చిన సమ్మతిగా భావించడానికి వీలులేదు. ఒక ప్రక్రియకు ఇచ్చే సమ్మతిని వేరొక ప్రక్రియ అమలు చేయడానికి వాడుకోకూడదు. అదనపు ప్రక్రియకు గానీ అనుబంధ ప్రక్రియకు గానీ ఆమోదంగా తీసుకోకూడదు. అమోదం పొందని ప్రక్రియ రోగి మంచికోసమేననీ, దానిని వివరించడంలో సమయం వృథా అవుతుందనీ ఇత్యాదిసాకులు చెప్పడానికి వీలులేదు. దీనికి ఒకే ఒక్క మినహాయింపు- రోగి ప్రాణాన్ని గానీ ఆరోగ్యాన్ని గానీ కాపాడడానికి వెంటనే ఏమైనా చేయవలసిన పరిస్థితి ఉండడం-అప్పుడు మాత్రమే రోగి సమ్మతి కోసం ఆగనక్కర లేదు. ఈ ప్రమాణాలను పాటించినట్టయితే రోగి సమ్మతి తీసుకోకుండా వైద్యం చేసినట్టేననీ, అప్పుడు ఏ హాని సంభవించినా, తగిన జాగ్రత్తలన్నీ తీసుకున్నాననీ చిత్తశుద్ధితో నమ్మి నిజాయితీగా చేశాననీ వాదించినా, అది నిజమే అయినా, డాక్టరు నష్ట పరిహారం చెల్లించక తప్పదనీ జస్టిస్ రవీంద్రన్ అన్నారు. కోహ్లీ విషయంలో లాపరోస్కోపీకీ, అవసరమైతే లాపరోటమీకీ మాత్రమే ఆమె ఇచ్చిన సమ్మతి ఆధారంగా, ఆమె ఇంకా అనస్తీషియా మత్తులో ఉండగానే హిస్టరక్టమీ చేసి గర్భసంచితో పాటు ఇతర జననాంగాలను కూడ తొలగించడం జరిగింది. పై ప్రమాణాల ప్రకారం అనామోదనీయమైన ఈ చర్యలన్నీ ఆమె ప్రాణానికి గానీ ఆరోగ్యానికి గానీ తక్షణ హానీ ఏదీ ఉండలేదనీ ఆయన నిర్ధారించారు.

> **'మనిషికి తన శరీరం మీద అనుల్లంఘనీయమైన హక్కు ఉంది' అన్న సూత్రాన్ని దృష్టిలో పెట్టుకున్నప్పుడు డాక్టరు విజ్ఞతతోనూ బాధ్యతాయుతంగానూ వ్యవహరించారా లేదా అన్నదొక్కటే కాదు, రోగి సమ్మతి ఉందా లేదా అన్నది కూడ ముఖ్యమైన విషయమే.**

ఈ తీర్పులోని ఒక అసంతృప్తికర అంశం ఏమిటంటే ఈ సూత్రీకరణ ప్రైవేట్ వైద్య సంస్థలకు మాత్రమే వర్తిస్తుందనడం. ప్రభుత్వ ఆస్పత్రులకూ, ధర్మ (ఛారిటబుల్) ఆస్పత్రులకూ వెళ్లే రోగులకు ప్రత్యామ్నాయాల గురించి చెప్పినా వాటిని అనుసరించే స్తోమత ఉండదు కాబట్టి వారి విషయంలో సమ్మతి అనే భావనకు అర్థం లేదని జస్టిస్ రవీంద్రన్ అన్నారు. వారికి వైద్యులు ఏం చేసినా అదే మహాభాగ్యం అన్నారు. ఇది అన్యాయం అనడంలో సందేహం అక్కర లేదు. ఆరోగ్యం కేవలం కలవారి హక్కుకాదు. అది అందరిదీ కాబట్టి ఏ ఆస్పత్రి అయినా ఏ వైద్యులయినా రోగి సమాచార హక్కును గౌరవించవలసిందే.